డివైడర్ పనులను పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: డివైడర్ పనులను పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ కమాన్ నుంచి కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న రోడ్డు డివైడర్ పనులను గురువారం అర్ధరాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా డివైడర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డివైడర్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, రామకృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పురేందర్ రెడ్డి, కాలనీ వాసులు ప్రసాద్, మాధవ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా పూజలందుకుంటున్న పెద్దమ్మ తల్లి అమ్మవారి ఆలయాన్ని నిర్మించుకోవటం సంతోషకరమైన విషయమన్నారు. కాలనీ ప్రజలందరూ కలిసి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాస్, రవి, షౌకత్ అలీ, అగ్రవాసు, మహేష్, నాగయ్య గౌడ్, సౌందర్య, వాలి నాగేశ్వరరావు, మహేష్, నాగేష్, మధు, కృష్ణ, గోపి, రాజు, బాలు, శ్రీను, తిరుపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం


హాస్పిటల్ సీఈఓను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ సభ్యులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని రాందేవ్‌రావ్ ఆసుపత్రి, రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ సంయుక్తంగా 2008 నుంచి నేటి వరకు నిరంతరాయంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పోలియో నిర్మూలన కోసం విశేషంగా కృషి చేసిన రాందేవ్‌రావ్ హాస్పిటల్ కూకట్‌పల్లి సీఈఓ డాక్టర్ యోబు, డాక్టర్ ప్రసాద్‌రావులకు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, సెక్రటరీ డి.శివరామకృష్ణారావు, రవీంద్ర, శివశంకర రావు, ఆర్ మురళీకృష్ణ, జయప్రకాష్ నంబూరు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ పాడి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో పశుగణన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు. నాలుగు నెలల పాటు తలపెట్టిన పశుగణన కార్యక్రమంలో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కుక్కలు, కోళ్లతో సహా 16 రకాల జంతువుల లెక్కను పక్కాగా సేకరించనున్నారు. ప్రతి ఐదేళ్లకు ఓసారి దేశ వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో తాజా లెక్కలను కచ్చితంగా గణన చేయడానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 15 మండలాల్లో సంబంధిత అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సిబ్బందితో పాటు గోపాల మిత్రులు, ఇతర ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా ఈ గణనలో భాగస్వామ్యాన్ని పంచుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పక్కాగా పెంపుడు జంతువుల వివరాలు నమోదు చేయడానికి సిబ్బంది ఇంటింటికి వస్తారని, ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ గౌతమ్ కోరారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. సుధాకర్, సహాయ సంచాలకుడు డా. ప్రభు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి..!

- చెత్త సేకరణలో ర్యాంకులు సాధించటంపై దృష్టి
- తడి, పొడి చెత్తను విడివిడిగా వేసేలా అవగాహన కార్యక్రమాలు
- ముందస్తు ప్రణాళికలతో అధికార యంత్రాంగం




సాక్షి,సిటీబ్యూరో: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు సాధించేందుకు నగర శివారు పురపాలక సంఘాలు దృష్టి సారిస్తున్నాయి. గతంలో కంటే మెరుగ్గా రాణించేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని ప్రజలకు సూచించినా.. పురపాలికల్లో 60 నుంచి 70 శాతమే ఇస్తున్నట్లు క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడవుతోంది. కొన్ని పురపాలక సంఘాల్లోనైతే అసలే పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పటం లేదని తెలుస్తోంది. ఫలితంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకుల సాధించటంలో పలు పురపాలక సంఘాలు వెనుకబడిపోతున్నాయి. ఈ ఏడాది అలాంటి విధానానికి భిన్నంగా పుర అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇదంతా డిసెంబరు వరకు కొనసాగనుంది.

డివిజన్లు/వార్డుల వారీగా ..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 29 పురపాలికల్లో 675 డివిజన్లు/ వార్డుల వారీగా ఇక నుంచి చైతన్య కార్యక్రమాలు నిర్వహించటానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారు. తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలో ప్రత్యేకంగా చూపించటంతో పాటు కరపత్రాలు, బ్రోచర్లను ఇంటింటికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భూమిలో కలిసిపోయే కూరగాయలు, ఇతర వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఒక డబ్బాలో వేయాలని సూచించనున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, ఇనుప ముక్కలు, కాగితాలు, అట్టలు ఇతర పొడి వ్యర్థాలను మరో డబ్బాలో వేయాలని నిర్దేశించనున్నారు. పురపాలికల్లోని ప్రధాన రోడ్ల వెంబడి హోర్డింగులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తాచెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పారేయకుండా అవగాహన కల్పించనున్నారు. పరిసరాల శుభ్రతపై విద్యా సంస్థల్లో పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మార్పు రావాలనే ఉద్దేశంతో...

స్వచ్ఛతకు వినియోగించే పురపాలిక వాహనాలు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది ఒకే డబ్బాలో చెత్త ఇవ్వకుండా అవగాహన కల్పించనున్నారు. అపార్టుమెంట్లు, కాలనీలు, గ్రేటెడ్ కమ్యూనిటీ ఏరియాలు, పారిశ్రామిక ప్రాంతాలు, ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రజల్లో విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా చెత్త సేకరణ విషయంలో మార్పు తీసుకురావాలని పురపాలక తగిన కార్యాచరణతో ముందుకు సాగేందుకు కసరత్తు చేస్తున్నారు.

మెరుగైన ర్యాంకు లక్ష్యంగా ..

స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఈసారి అవార్డు వచ్చేలా పురపాలక సంఘాలు పోటీ పడుతున్నాయి. గతంలో కంటే మెరుగైన ర్యాంకు సాధించిన పురపాలికలు రాష్ట్ర స్థాయిలో పోటీ పడేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లేందుకు కసరత్తు చేస్తున్నాయి. పట్టణ ప్రజలు కూడా చెత్త విషయంలో నిబంధనలు పాటించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కోరుతున్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే ర్యాంకు తప్పక వస్తుందన్న పట్టుదలతో ముందడగుకు సిద్ధమవుతున్నారు.

92 మంది హాజరు.. 26 మంది గైర్హాజరు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్ 1 పరీక్షలు శుక్రవారం 5వ రోజు ప్రశాంతంగా జరిగాయి. 114 మంది దివ్యాంగులు, నలుగురు ఇతరులు మొత్తం 118 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 92 మంది హాజరయ్యారు. 26 మంది హాజరు కాలేదని అధికారులు తెలిపారు. మరో రెండు రోజుల పాటు ఈ పరీక్షలు జరుగనున్నాయి.

విద్యార్థులకు చెక్కుల అందజేత

మూసాపేట: భరత్‌నగర్ స్ప్రింగ్ స్కూల్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు 5 వేల చొప్పున ఇద్దరు విద్యార్థులకు గోవిందా చారుల ట్రస్ట్ శుక్రవారం చెక్కులను అందజేసింది. ఇద్దరు పేద విద్యార్థులు చదువులో ముందుండటంతో చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగిరెడ్డి, నాగేశ్వరరావు, సూర్యనారాయణ మూర్తి, స్ప్రింగ్ స్కూల్ హెచ్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న డా. పి. నాగిరెడ్డి

సర్టిఫికెట్లు ఇప్పించాలని విద్యార్థుల నిరసన



మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీలోని ఏఐఎంఎంఎస్ కళాశాల విద్యార్థులు మరోసారి నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం మోసం చేసిందని, లక్షల ఫీజు తీసుకొని గుర్తింపు లేని కళాశాల నడిపిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. తమ సర్టిఫికెట్లు, తాము చెల్లించిన డబ్బును ఇప్పించాలని కోరారు. గతంలో యాజమాన్యం ఐదు రోజులు గడువు అడిగిందని, గడువు ముగియడంతో పోలీస్ స్టేషన్‌కు మళ్లీ వచ్చామని తెలిపారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై అభ్యర్థనలు ఇవ్వండి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణలో స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆసక్తి కలిగిన పార్టీలు, ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరించాలని నిర్ణయించినట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఇందిర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 13 వరకు అన్ని పని దినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖైరతాబాద్‌లోని రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో వినతులు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను దాఖలు చేయాలని సూచించారు. అలాగే తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం 7న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ జరుపుతుందన్నారు. ఇందులో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం తదితరులు పాల్గొంటుందన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ రైతు బజార్ వెనుక సర్వే నెంబర్ 336లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని తహసీల్దార్ ఆదేశాల మేరకు శుక్రవారం అధికారులు కూల్చివేశారు. ఇదే స్థలాన్ని నాటి రాష్ట్ర ప్రభుత్వం ఫైర్ స్టేషన్, గ్రంథాలయం కోసం కేటాయించింది. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణం చేపట్టకపోవడంతో భూకబ్జాదారుల కన్ను పడింది. కబ్జాలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో మండల అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలం
- బీఆర్ఎస్ పాలనలోనే నియోజకవర్గం అభివృద్ధి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రజల బాగోగులను పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కేపీహెచ్‌బీ డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రిగా కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నగరంలోని అన్ని రంగాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల నిర్వహణకు ఒక్క రూపాయి కూడా వెచ్చించలేని స్థితికి జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు చేరాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వేల కోట్ల రూపాయలతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నామని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందటం ఖాయమన్నారు. ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ రాజేష్, సాయిబాబు, నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధోబీఘాట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీ డివిజన్ 7వ ఫేజ్‌లోని ధోబీ ఘాట్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో డివిజన్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. పార్కులు, ఫ్లైఓవర్‌లు, ఇండోర్ స్టేడియాలు వంటి సదుపాయాలను ప్రజలకు అందించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, డీఈ శ్రీదేవి, ఏఈ సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

కబ్జా చేస్తే చర్యలు తప్పవు

ప్రశాంత్‌నగర్ పాత కోర్టు భవనం ఎదురుగా ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని కొందరు కబ్జా చేస్తున్నట్లు దయార్‌గూడ బస్తీవాసులు ఎమ్మెల్యే కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన శుక్రవారం స్థానికులు, బస్తీ వాసులతో కలిసి శ్మశాన వాటికను పరిశీలించారు. సర్వే నెం 200లలో సుమారు ఐదు ఎకరాలకు పైగా భూమిని శ్మశాన వాటిక కోసం వదలినట్లు రెవెన్యూ రికార్డులు ఉన్నాయని తెలిపారు. కబ్జాదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నాలాలు, శ్మశాన వాటికలను కబ్జా చేస్తున్న వారిపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


దోబీఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హెచ్‌సీయూలో పోలింగ్ ప్రశాంతం


ఓటు వేస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం–2024, 25 ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. శుక్రవారం హెచ్‌సీయూ క్యాంపస్‌లో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నిక నిర్వహించారు. క్యాంపస్ మొత్తంలో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళిని రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, ఎన్నికల సంఘం చైర్‌పర్సన్ ప్రొఫెసర్ పద్మ, డీఎస్‌డబ్ల్యూ ప్రొఫెసర్ శ్రీనివాస రావు, ఇతర ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు. 77.96 శాతం పోలింగ్ జరిగింది. ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఏ, బీఎస్ఎఫ్, డీఎస్‌యూ ఒక కూటమిగా, ఏబీవీపీ–ఎస్ఎల్‌విడి కలిసి మరో కూటమిగా,ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఏ, ఎంఎస్ఎఫ్ ఇంకో కూటమి,ఏఐటీబీసీఎస్ఏ, టీఎస్ఎఫ్, వైఐఎస్ఎస్ మరో కూటమి, 3 విద్యార్థి సంఘాలు కలిపి మరో కూటమిగా బరిలో నిలిచాయి.

స్కూల్ బస్ డ్రైవర్ గుండెపోటుతో మృతి

కేపీహెచ్‌బీ కాలనీ: ఓ ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్ ఛాతిలో నొప్పితో కిందపడిపోవడంతో స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా సోమవారం గ్రామానికి చెందిన సంకినేని యాకయ్య బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జగద్గిరిగుట్ట ప్రాంతంలో నివాసం ఉంటూ కేపీహెచ్‌బీ పరిధి అడ్డగుట్ట ప్రాంతంలోని జీవ గురుకుల్ స్కూల్ బస్సు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. మూడు నెలలుగా బస్సు డ్రైవర్ గా పనిచేస్తున్న యాకయ్య శుక్రవారం యథావిధిగా స్కూల్ కు వెళ్లాడు. ఉదయం 11.30 గంటల సమయంలో ఛాతిలో నొప్పి వచ్చిందని కిందపడిపోయాడు. దీంతో వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. పరీక్షించిన వైద్యులు గుండెనొప్పితో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు యాకయ్య కొడుకు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పనులను సత్వరమే పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని వివేకానందనగర్ కాలనీలో నిర్మిస్తున్న డివైడర్, సిమెంట్ రోడ్డు పనులను ఏఈ శ్రావణి, స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, పురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఒడిబియ్యంతో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న నాగుల సత్యం తదితరులు

మోతీనగర్: అన్ని దానాలకన్నా అన్నదానం మహా గొప్పదని బీఆర్ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు నాగుల సత్యం గంగపుత్ర అన్నారు. ఇటీవల దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి పోసిన ఒడిబియ్యంతో శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతి పౌర్ణమి నాడు ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎం. నరసింహ యాదవ్, రాజు, చారి తదితరులు పాల్గొన్నారు.

గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు


కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్, జమీర్ తదితరులు

మోతీనగర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమీర్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్‌లో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మూడు వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో తూము వేణు, మొయిజుద్దీన్, విఠల్ రెడ్డి, కనకయ్య, సయ్యద్ ఐజాజ్, మస్తాన్‌రెడ్డి, నజీర్, ఇర్ఫాన్, శివ చౌదరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో చెత్తాచెదారం తొలగింపు



మోతీనగర్: దీపావళి పండుగను పురస్కరించుకొని శుక్రవారం మూసాపేట సర్కిల్ అల్లాపూర్ డివిజన్ వి. రామారావునగర్ హిందూ శ్మశాన వాటికలో చెత్తాచెదారాన్ని, కలుపు మొక్కలను తొలగించారు. మరణించిన కుటుంబ సభ్యుల సమాధుల వద్ద దీపావళి పండుగ రోజు పూజలు నిర్వహించడానికి అన్ని వసతులను జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

శుభాకాంక్షలు తెలిపిన నేతలు


తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నను సన్మానిస్తున్న సప్పిడి భాస్కర్

మూసాపేట: తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కందాడి జ్యోత్స్నను శుక్రవారం టీపీసీసీ లేబర్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సప్పిడి భాస్కర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ జిల్లా అధ్యక్షులు కందాడి సుదర్శన్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్ బోర్డు కనిపించడం లేదని చెట్ల నరికివేత



మోతీనగర్: మూసాపేట సర్కిల్ అల్లాపూర్ డివిజన్‌లో కైత్లాపూర్ వెళ్లే బ్రిడ్జి పక్కన హోటల్ నిర్వాహకుడు తన హోటల్ బోర్డు కనిపించడం లేదని రోడ్డు పక్కన ఉన్న చిన్న చిన్న చెట్లను కొట్టివేశాడు. ఉదయం వేళ వాకింగ్‌కు వెళ్లే వాకర్స్ చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పక్క ప్రభుత్వం చెట్లను పెంచాలని చెబుతుంటే, మరో పక్క చెట్లను నరికివేస్తూ పర్యావరణానికి హానీ కలిగిస్తున్నారు. చెట్లను నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.